ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 10 జనవరి 2024

ఆ రెండు చోట్ల.. ఎవరికో



- 'ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ మాకు వద్దు.. సీఎం జగన్ మాత్రమే ముద్దు'.. ఎచ్చెర్లలో అసమ్మతి నేతల డిమాండ్ ఇది.
- 'స్థానికేతరులకు టికెట్ అస్సలు ఇవ్వొద్దు. స్థానికులకే ఇస్తే కలిసి పనిచేస్తాం'.. పాతపట్నంలో వినిపిస్తున్న డిమాండ్ ఇది.
- ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ మూడో జాబితాను బుధవారం విడుదల చేయనున్నారు. ఈ జాబితాలో వీరి పేర్లు ఉంటాయా? అన్నది సందేహంగా ఉంది. ఇక్కడ ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారోనని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా వైసీపీ సీట్ల విషయంలో గందరగోళం.. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత అంశాలు తమకు కలిసొస్తాయని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.



- ఇప్పటికే ఎచ్చెర్ల అభ్యర్థి మార్పు దాదాపు ఖరారు
- పాతపట్నంలో స్థానికులకే ఇవ్వాలని డిమాండ్
- మూడో జాబితాలో ఎవరెవరు మారునున్నారో..?
- అధికార పార్టీ నాయకుల్లో టెన్షన్.. టెన్షన్
- టీడీపీ-జనసేనకు కలిసొస్తున్న వైసీపీ తప్పిదాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో అధికార పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అభ్యర్థులను మార్పు చేయాలని రెండేళ్లుగా డిమాండ్ చేస్తున్న అసమ్మతి నేతలు ఇప్పుడు ఇప్పుడు స్వరం పెంచారు. సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల మార్పు చేస్తూ.. ఇప్పటికే రెండు జాబితాలను విడుదల చేసిన సీఎం జగన్.. మూడో జాబితాను కూడా బుధవారం విడుదల చేసే అవకాశముంది. ఇందులో ప్రధానంగా ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాలు ఉంటాయని ప్రచారం తీవ్రమైంది.

అక్కడ ఎంపీ.. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా..

ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం లోక్‌సభ పరిధిలో ఉంటుంది. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్.. మూడేళ్లుగా జడ్పీ సర్వసభ్య సమావేశాలకు.. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా 'ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ మాకు వద్దు.. జగన్మోహన్‌రెడ్డి మాత్రమే ముద్దు' అంటూ జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు నుంచి నియోజకవర్గంలో సైతం నిరసనలు కొనసాగుతున్నాయి. జిల్లాస్థాయి వైసీపీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స మాట్లాడుతూ.. 'కిరణ్ వద్దు.. జగన్ ముద్దు' వంటి కార్యక్రమాలు చేపట్టవద్దని.. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి ఉండాలని ఆదేశించారు. అయినప్పటికీ నిరసనలు తగ్గలేదు. అయితే విజయనగరం ఎంపీ బెల్లానకు బొత్స ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. ఎచ్చెర్ల నుంచి పోటీచేయాలన్నది తన చర్యల ద్వారానే బహిర్గతమైంది. ఇటు ప్రస్తుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌పై అసమ్మతి పెరగడంతో దాదాపు అభ్యర్థి మార్పు తప్పదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ స్థానానికి బెల్లాన పేరు వినిపిస్తోంది. అయితే బెల్లాన.. ఈ నియోజకవర్గంలో స్థానికేతరుడుగానే ప్రజలకు పరిచయమవుతారు. ఇలాంటి పరిస్థితిల్లో అధికార పార్టీ నిర్ణయం టీడీపీకి కలసివచ్చేలా ఉండబోతుంది.

పాతపట్నంలో పెరిగిన నిరసనలు..



పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి.. 2014 ఎన్నికల్లో వైసీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. జిల్లా పార్టీ బాధ్యతలు కూడా చూశారు. ఈమె భర్త గతంలో ఉన్నతస్థానంలో అధికారి కావడం.. జగన్‌తో సాన్నిహిత్యంతో టిక్కెట్ కేటాయించారు. 2019లో రెడ్డి శాంతి పాతపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆతర్వాత రెడ్డి శాంతి భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఆతర్వాత జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో సొంత కుమారుడ్ని నిలబెట్టినా అక్కడున్న వ్యతిరేకత వల్ల గెలిపించుకోలేక పోయారు. ప్రస్తుతం అభ్యర్థులను మార్పు చేస్తున్నారన్న కారణంతో అక్కడ అసమ్మతి నాయకుల నిరసనలు జోరందుకున్నాయి. స్థానికేతరులకు టికెట్ ఇవ్వొద్దని, స్థానికులకే ఇస్తే గెలిపిస్తామని మంగళవారం నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈవిషయాన్ని విలేకర్ల సమావేశం నిర్వహించిమరీ చెప్పేశారు. దీంతో బుధవారం విడుదలయ్యే మూడో జాబితాలో ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారో తేలనుంది. దీంతో పాటుగా.. ఆమదాలవలస నియోజకవర్గంపై ఉన్న సందిగ్ధత కూడా తేలనుంది. కొద్దిరోజుల క్రితం ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు నాలుగు గ్రూపులు తాడేపల్లి వెళ్లి జగన్‌ను కలిసి స్థానిక పరిస్థితిని వివరించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం వెళ్లి సీఎంను కలిశారు. తన కుమారుడికి సీటు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. తాజా పరిస్థితుల కారణంగాను.. అధికారపార్టీ తప్పిదాల వల్ల ప్రత్యక్షంగాను.. పరోక్షంగాను టీడీపీ-జనసేనకు మరింత లాభం చేకూరేలాఉంది. దీనికితోడు ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండడంతో జిల్లాలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు.

మంత్రివర్యా.. ఇసుక దందా కనిపించట్లేదా?

- వంశధారలో టీడీపీ శ్రేణుల నిరసన



వంశధార తీరంలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు గొండు శంకర్ తదితరులు

గార, జనవరి 9: 'ఎంతో నీతివంతమైన పాలన అందిస్తున్నట్లు మంత్రి ధర్మాన ప్రసాదరావు గొప్పలు చెబుతుంటారని, కానీ ఆయన ఇలాకాలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, ఈ దందా మంత్రికి కనిపించట్లేదా' అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని బూర వెల్లి, అంబళ్లవలస దగ్గర వంశధార నదిలో చేపడుతున్న ఇసుక తవ్వకాల వద్ద మంగళవారం టీడీపీ యువ నాయకుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఇలాకాలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. ఇసుక తవ్వకాలతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి పశువులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నా అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. నదీ గర్భంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. తాడేపల్లి పేలస్ కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తీరం కోతకు గురై వరదల సమయంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలుపుదల చేయకపోతే తామే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండ భాస్కరరావు, బీజీపీ ఆర్ మూర్తి, బడగల వెంకట అప్పారావు, కె.ఆదినారాయణ, మైగాపు ప్రభాకరరావు, శిమ్మ శ్రీనివాస్, మళ్ల త్రినాథరావు, మళ్ల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

- మూడు మండలాల నుంచి 215 కుటుంబాలు..
- ఆహ్వానించిన ఎంపీ రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే కలమట



హిరమండలం: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన భగీరథపురం ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు

హిరమండలం/ఎల్ఎన్‌పేట/కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఒక్కరోజు మూడు మండలాలల నుంచి 215 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. హిరమండలం మండలం లోని భగీరథపురం, నీలాదేవిపురం గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరిలో భగీరథ పురం ఉప సర్పంచ్ ఎస్.రామరాజుతో పాటు నలుగురు వార్డు సభ్యులు ఉన్నారు. అలాగే, ఎల్.ఎస్.పేట మండలం లోని పెద్దకొల్లివలస ఆర్అండ్ఆర్ కాలనీ, స్కాట్‌పేటకు చెందిన 70 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరాయి. అదే విధంగా కొత్తూరు మండలంలోని దాశరధిపురం గ్రామానికి చెందిన 65 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. భగీరథపురం పంచాయతీ అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేస్తే స్థానిక వైసీపీ సర్పంచ్ పంచాయతీ తీర్మానం ఇవ్వకుండా అభివృద్ధి పనులను అడ్డుకోవడం ప్రజల గమనించాలని ఎంపీ రామ్మోహన్ అన్నారు. రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో అతని కుమారుడు జగన్‌కు ప్రజలు ఓట్లువేసి గెలిపించారే తప్ప ఆయనపై ఉన్న నమ్మకంతో కాదని ఎంపీ విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో జగన్ విఫలమయ్యారని తెలిపారు. రానున్న రోజుల్లో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని తెలిపారు.



కొత్తూరు: పార్టీలో చేరిన వారితో ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



ఎల్ఎన్‌పేట: పార్టీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి

ఎన్నికల నిర్వహణపై సీఈసీ సమీక్ష

- హాజరైన కలెక్టర్ శ్రీకేష్, ఎస్పీ రాధిక



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

శ్రీకాకుళం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విజయవాడలో సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షకు కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్, ఎస్పీ జీఆర్‌రాధిక హాజరయ్యారు. ఎన్నికలకు ముందస్తుగా తీసుకున్న చర్యలను ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు వివరించారు. ఎన్నికలకు సన్నద్ధత, ఓటర్ల జాబితా తయారీ.. ఎన్నికల సామగ్రి, అవసరమైన సిబ్బంది, అలాగే రెండేసి చోట్ల ఓట్లున్నవారిపై ఇప్పటికే వినతులు ఇవ్వడంపై, ఒకే డోర్ నంబర్‌లు, జీరో డోర్‌నంబర్లు వంటివాటిపై అందిన అభ్యర్థనలు.. తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు. బుధవారం కూడా సమీక్ష జరుగనుంది. ఈ సమీక్షలో ఎన్నికల కమిషనర్లు అనుప్‌చంద్రపాండే, అరుణ్‌గోయెల్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదే లేదు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

- జిలాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, మునిసిపల్ కార్మికుల సమ్మె
- వినూత్నంగా నిరసనలు
- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్

(అరసవల్లి, జనవరి 9)

జిల్లాలో తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, సమగ్రశిక్ష అభియాస్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు, మునిసిపల్ కార్మికులు వేర్వేరుగా ఉద్యమిస్తున్నారు. వినూత్న రీతిలో నిరసనలు చేపడుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకూ పోరాటం ఆపేది లేదని అంటున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సమ్మెలో భాగంగా 21వ రోజు మంగళవారం సమగ్రశిక్ష ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వరకు ర్యాలీ చేపట్టారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురిచేయడం దారుణమని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, కార్యదర్శులు యుగంధర్, నరసింగరావు, ప్రసాదరావు, ఉపాధ్యక్షులు గిరిధర్, పోతయ్య, శివ పాల్గొన్నారు.

ఆమరణ దీక్షకు కూడా వెనుకాడం..

కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనలు కొనసాగిస్తు న్నారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి అల్లు మహాలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు గత 29 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి మొండివైఖరి వీడకపోవడం దారుణమని అన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, బెదిరింపులకు పాల్పడడం, నోటీసులు ఇవ్వడం మానుకోవాలన్నారు. కేసులు, నిర్బంధాలకు భయపడమని, ఆమరణ నిరాహారదీక్షకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్ వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చాలని, మెనూ చార్జీలను పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అల్లు సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పర్మినెంట్ చేస్తామని పంగనామాలు పెట్టారు..

తమను పర్మినెంట్ చేస్తామని చెప్పి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు పంగనామాలు పెట్టాడని మునిసిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుగుల గణేష్ అన్నారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు పంగనామాలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.శంకర రావు, ఆర్జి రాము, ఎ.శేఖర్, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం అనాగరికం

- ప్రజా సంఘాల జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్తం

అరసవల్లి, జనవరి 9: అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అనాగరికమని, వెంటనే జీవో నెంబర్-2ను రద్దు చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. పొన్నాడ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు 11 మందిని అరెస్టు చేసి 1వ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సంద ర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జరుగుతున్న అంగన్‌వాడీల సమస్యలతో పాటు మునిసిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ అమ్మన్నాయుడు పాల్గొన్నారు



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పంగనామాలతో నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు



ధర్నా చేస్తున్న ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపండి

● ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట రమణమూర్తి

హిరమండలం: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో సాగనంపాల్సి అవసరం ఉందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం అంబావల్లి గ్రామంలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక భవనం, రూ.4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. జల వనరుల శాఖను పూర్తిగా విస్మరించారని, దీంతో సాగునీరందక రైతులు అవస్థలు పడ్డారన్నారు. ఐదేళ్లుగా యువత భవిష్యత్తును ఈ సర్కార్ చీకట్లోకి నెట్టేసిందని ఆరోపించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. టీడీపీతోనే సమగ్రాభివృద్ధి చెందుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, నేతలు కె.నాగరాజు, బర్రి సురేష్, కె.సింహాచలం, ఎస్.గోవిందరావు, దారపు డిల్లేశ్వరరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

వైసీపీ నుంచి పలువురు నేతలు టీడీపీ చేరిక

మబగాం(పోలాకి): రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్వగ్రామం మబుగాం నుంచి సుమారు 40 మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రానున్న ఎన్ని కల్లో అందరూ సమష్టిగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నేత కాయ రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



డీజీపురం పాఠశాలలో సంబరాల దృశ్యం

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యా ర్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణ చేసి పాఠ శాల ఆవరణలో రంగవల్లికలు తీర్చిదిద్దారు. హరిదాసు, జంగమయ్య, సోదమ్మ వేషాలతో ఆకట్టు కున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా విద్యాలయంలో..



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న బాబూరావు, భవాని

పలాస: స్థానిక శివాజీ నగర్ మదర్ థెరిసా విద్యాలయంలో మంగళవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు వజ్జ భవాని, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావు సంబరాలను ప్రారంభించారు. మన సంప్రదాయాలు కనుమరుగు కాకుండా పిల్లలకు వీటిని నేర్పించడంతో పాటు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగీ మంటలు, పసుపును దంచడం, పిండివటకాలు చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయివినీత్ విద్యాసంస్థల్లో..



ఏరువాకతో డాక్టర్లు కోదండరావు, లీల

వజ్రపుకొత్తూరు: పూండిలోని సాయి వినీత్ విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబ రాలు నిర్వహించారు. విద్యా సంస్థల అధి నేతలు డాక్టర్ కోదండరావు, డాక్టర్ లీల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించారు. భోగీ మంటలు, గాలిపటాలు ఎగురు వేయడం, గంగి రెద్దుల ఆట, తప్పెటగుళ్ల ప్రదర్శన, రంగవల్లులు పోటీలు నిర్వహించారు. జడ్పీ వైస్‌చైర్మన్ పాలిన శ్రావణి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను తిలకించి విజేతలకు బహుమ తులు అందించారు. కార్యక్రమంలో పీఎంపురం సర్పంచ్ గొరకల వసంతరావు, గోవిందపురం సర్పంచ్ పాలిన రమ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి స్వగ్రామాలకు..

జలుమూరు: సంక్రాంతిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వగ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో గ్రామాలు కళకళలా డుతున్నాయి. సంక్రాంతి మరో ఐదు రోజులు మాత్రమే ఉండడంతో సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, కుటుంబ పోషణకు పనులపై వెళ్లిన వారు స్వగ్రామాలు చేరుకుంటున్నారు.

మూలపేట నిర్వాసితులతో సబ్ కలెక్టర్ సమావేశం

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించిన రైల్వే రోడ్డు నిర్వాసితులతో మంగళవారం రాత్రి తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సమావేశ మయ్యారు. కాశీపురం, కోటపాడు గ్రామాలకు చెందిన ఎల్ఎల్‌నాయుడు, కోత మధుసూదనరావు, కోత సతీష్, కోత చిన్న బాబు, సద్గుణ తదితర రైతులు తమ నష్టపరిహారంపై మాట్లాడారు.

రేపు సిక్కోలు జానపద కళాజాతర

పలాసరూరల్: గురుదాసుపురంలో గురువారం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో సిక్కోలు కళాజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దానం గ్రామాల్లో మంగళవారం కళాజాతర రథంతో ప్రచారం ప్రారంభించారు. ప్రజ లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్లపై ఈడ్చి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

నందిగాం: ఉపాధ్యాయులు బకాయిలు కోసం అంచెలంచెల నిరసనల్లో భాగంగా 36 గంటల ధర్నాకు విజయవాడ వెళ్లగా వారిని రోడ్లపై ఈడ్చి అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రూ.20 వేల కోట్లు బకా యిలు ఉండగా, ప్రభు త్వానికి అనేక పర్యా యాలు అడిగి విసిగిపోయామన్నా రు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ధర్నాకు వెళ్లిన ఉపాధ్యా యులను ఈడ్చి తీసుకు వెళ్లడం అత్యంత బాధా కరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు.

ముఖద్వారం ఏర్పాటు చేయండి

జలుమూరు: దక్షిణకాశీ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం గ్రామానికి ముఖద్వారం ఏర్పాటు చేయాలని చేయూత గ్రూపు సభ్యులు కోరారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఆమె స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కాశీబుగ్గ: గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మంగళవారం పెంటి భద్రలో బోర్, పైపులైన్ ఏర్పాటుకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమేశ్వరరావు, కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు సాయిజశ్వంత్

టెక్కలి: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఈనెల 24 నుంచి 28 వరకు జరగనున్న 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు టెక్కలి నుంచి దండుపాటి సాయి జశ్వంత్ ఎంపికైనట్లు క్లబ్ అధ్యక్షుడు దోని బుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించనున్న పోటీలకు జశ్వంత్ హాజరవుతాడన్నారు. ఈ సందర్భంగా అతడిని వ్యాయామ ఉపాధ్యాయుడు, కోచ్ నీలయ్య, నారాయణ, రమేష్, ప్రకాష్, శ్రీనివాసరావు అభినందించారు.

ఆల్ఇండియా తైక్వాండో పోటీలకు...

టెక్కలి: స్థానిక క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన పూడి కుమార్ తైక్వాండో పురుషుల 80 కిలోల విభాగంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జేజేటీ యూనివర్శిటీలో జరుగు పోటీల్లో కుమార్ పాల్గొంటున్నట్లు ఐతం కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, కోచ్ నర్సిపురం శేఖర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కల్లేపల్లి శ్రీధర్ అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ఈనెల 18 వరకు ప్రకటించిన నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవో తులసీరావుకు వినతిపత్రం అందజేశారు. టెక్కలిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మురళి, ప్రతినిధులు శ్యామ్, మదన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కరవంజలో కాశీ విశ్వేశ్వర జాతర

జలుమూరు: కరవంజ గ్రామంలో కాశీ విశ్వేశ్వర స్వామి జాతర ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నేతాజీ, మాజీ సర్పంచ్ జుత్తు అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. 15న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వెయిట్ లిఫ్టర్లు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూర్యనారాయణ, రామారావు, శ్రీను, సురేష్, ప్రసాద్, యర్రయ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ గ్యారెంటీలు లేక.. ట్రక్ షీట్లు రాక



నందిగాం వేబ్రిడ్జి వద్ద ఇలా..

నందిగాం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీలు లేక పోవడంతో ట్రక్ షీట్లు రాలేదు. దీంతో రైతులు ధాన్యం వాహనాలతో వేబ్రిడ్జిల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్నాపురం, కల్లాడ, దిమిలాడ, పెద్దలవునిపల్లి, దేవుపురం తదితర గ్రామాలకు చెందిన ధాన్యం లోడ్లతో వాహనాలు నందిగాం సర్వీస్ రహదారి సమీపంలోని వే బ్రిడ్జిల వద్ద బారులుదీరాయి. సాయంత్రం వరకు వాహనదారులు, సంబంధిత రైతులు ట్రక్ షీట్లు వస్తాయన్న ఆశతో వేచిచూసినా ఫలితం లేకపోవడంతో చివరకు రోడ్డుపై ధాన్యం లోడ్లు ఉంచి స్వగ్రా మాలకు వెళ్లడం కనిపించింది. బుధవారం ఉదయానికి మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీలు వస్తాయని తదుపరి ట్రక్ షీట్లు జారీ అవుతాయని ఆర్బీకే సిబ్బంది తెలిపారు.

రెండు రోజులుగా మిల్లుల వద్దే..



గొప్పిలి మిల్లు వద్ద ధాన్యం లోడులతో వేచి ఉన్న రైతులు

మెళియాపుట్టి: ఒకేసారి ఎక్కువ మంది రైతులకు ధాన్యం విక్రయానికి సంబంధించి ట్రక్ షీట్లు రావడంతో మిల్లుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. గడచిన రెండు రోజులుగా మిల్లుల వద్దే ధాన్యం విక్రయానికి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని జలగలింగుపురం గ్రామానికి చెందిన నడుమింటి సోమేష్ తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సోమవారం అధికంగా ఒకేసారి గొప్పిలి మిల్లుకు ట్రక్ షీట్లు ఇవ్వడం వల్ల మిల్లు వద్ద అన్‌లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సుమారు 30 ట్రాక్టర్లు ఉండ డంతో అన్‌లోడ్ నత్తనడకగా సాగుతుండడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. 40 కిలో మీటర్లు దూరం నుంచి ధాన్యం తీసుకొన్ని వెళ్లి అన్‌లోడ్ చేయాలని మిల్లర్లను కోరినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మస్టర్ల దిద్దుబాటు సరికాదు: డ్వామా పీడీ

పోలాకి: గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల మస్టర్లలో క్షేత్ర సహాయకుల దిద్దుబాట్లు సరికాదని, ఇది మంచి విధానం కాదని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఎంపీ డీవో కార్యాలయం ఆవరణలో సామాజిక ప్రజావేదిక కార్యక్రమం ఎంపీడీవో కె.ఉషశ్రీ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. పనుల సమయంలో క్షేత్రస్థాయి పర్యవేక్షకుల లోపా లను గుర్తించామన్నారు, గతంలో జరిగిన రెండు ఆడిట్లతో ఇవే తప్పులు గుర్తించామని, మరలా పున రావృతం కావడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. క్షేత్రసహాయకుల పనితీరు దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా పరీక్షల తరువాతే చర్యలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెట్రోల్ బంకులో పెట్రోలు, డీజిల్ నాణ్యతా పరీక్షలు చేసిన తరువాత వచ్చిన ఫలితాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనా తెలిపారు. పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ కల్తీ చేసి విక్రయాలు చేస్తున్నట్లు తన దృష్టికి రావడంతో తనిఖీ చేశామన్నారు. పెట్రోల్ పంపింగ్ తీరును పరిశీలించారు. తాత్కాలికంగా విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. బుధవారం నాణ్యత పరీక్షల తరువాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, మండల సర్వేయరు ఆర్.గవరయ్య, రెవెన్యూ కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.

గ్రామాల్లో సికిల్‌సెల్ టెస్ట్‌లు పెంచాలి

కొత్తూరు: గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు పెంచాలని ఐటీడీఏ పీవో కల్పనా కుమారి అన్నారు. మంగళవారం ఇరపాడుగూడ గ్రామంలో పీవో పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న సికిల్‌సెల్ పరీక్షల తీరును పరిశీలించారు. వ్యాధిగ్రస్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు.

బాలిక విద్యకు సావిత్రీబాయి పూలే కృషి



ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న దృశ్యం

మందస: బాలికల విద్య ఆవశ్యకతను మొదటిగా గుర్తించి దేశంలో మొదటి సారిగా ప్రారంభించిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయి పూలే అని వక్తలు అన్నారు. హరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలు నిర్వహించారు. ఆమె చిత్రప టానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, ఎం. భాస్కరరావు, హెచ్ఎం జి.ఉమారాజ్, యూటీఎఫ్ నాయకులు బాబూరావు, గుంట కోదండ రావు, రమేష్, రాజాన పరమేశ్వరరావు, పి.కొండలరావు పాల్గొన్నారు.

యోగాసనాల్లో ఆశీష్‌కు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు



ఆశీష్‌కు వరల్డ్ రికార్డ్ ధ్రువపత్రం అందిస్తున్న నిర్వాహకులు

టెక్కలి/పలాసరూరల్: టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ బలరాంపురానికి చెందిన సంపతిరావు ఆశీష్ విశాఖలో ఓం ఫ్రీ యోగా సంస్థ మంగళవారం నిర్వహించిన 216, 108 రౌండ్ల సూర్య నమస్కారాల్లో పాల్గొని యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సాధించాడు. 88 నిమిషాల్లో 2,592 ఆసనాలు వేసి ఈ రికార్డు కైవసం చేసుకున్నాడు. వివిధ రాష్ట్రాల నుంచి 270 మంది యోగా అభ్యాసకులు పాల్గొన్నారు. ఈ విద్యార్థి పలాస మండలం రామ కృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో ఏడో తరగతి చదువు తున్నాడు. ఈ సందర్భంగా ఆశీష్‌ను పాఠశాల చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్

● ఎమ్మెల్యే బెందాళం అశోక్



బైరిపురంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి: టీడీపీపైనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం బైరిపురంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బంగారు కురయ్య, కార్యదర్శి మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, పిలక చిన బాబురెడ్డి, టీవీ రమణ, మురళీమోహన్ పట్నాయక్, పైల సూర్యనారాయణ రెడ్డి, వాసాల రమేష్, బొడ్డ హరిబాబు, గన్ని శ్రీను, కిరణ్, మద్దిల ఆనంద్, బాస్కర్, పైల రామారావు, దుర్గాశ్రీను, కె.కురయ్య పాల్గొన్నారు.



పొందూరు: లోలుగులో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

లోలుగులో..

పొందూరు: లోలుగు గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, లోలుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిదుడుకులు ఎదుర్కొనే శక్తి క్రీడాకారులకే సాధ్యం

● మంత్రి అప్పలరాజు

● జాతీయ స్థాయి టెన్నీ కాయిట్ పోటీలు ప్రారంభం



విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన



హాజరైన వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

పలాస, జనవరి 9: జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొనేశక్తి ఒక్క క్రీడాకారులకే ఉంటుందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 47వ సీనియర్ జాతీయ స్థాయి టెన్నీ కాయిట్ చాంపియన్-2024 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాసలో ఇప్పటి వరకు అనేక రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించిన చరిత్ర ఉందని, తొలిసారి జాతీయస్థాయి పపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అంతకు ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఫ్లాగ్ మార్చ్ చేశారు. అలాగే విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వైడి రామారావు, టెన్నీ కాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి పి.తవిటయ్య, వ్యాయామోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు పి.సుందర రావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు ఎంపీ రమణ, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం కోసం సైకిల్ యాత్ర

● పలాస చేరుకున్న సంపూర్ణ శుక్లా, దినకర్‌దాస్



సైకిల్ యాత్ర చేస్తున్న సంపూర్ణ శుక్లా, దినకర్‌దాస్

పలాస, జనవరి 9: లక్నో ఆలిండియా రేడియోలో జాకీగా పనిచేస్తున్న సంపూర్ణ శుక్లా 'సేవ్ వాటర్.. సూవ్ లైఫ్' అనే నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. గత ఏడాది ఆగస్టు 3న సైకిల్ యాత్ర ప్రారం భించి వివిధ రాష్ట్రాల మీదుగా ప్రయా ణిస్తూ ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాడు.. అలాగే అయోధ్యకు చెందిన దినకర్‌దాస్ 'మద్యపానం, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టం'పై యువతను చైతన్యం చేసేందుకు శాంతికుండ్ ఆశ్రమం నుంచి బయలు దేరి యాత్ర సాగిస్తున్నాడు.. ఇద్దరూ వేర్వేరు ప్రాంతాలైనా యాదృచ్ఛికంగా ఇద్దరూ సైకిల్ యాత్ర చేస్తూ ఒడిశాలో ఒకరికొకరు తారస పడారు. ఇద్దరూ ఒకరికొకరు పరిచయం చేసుకోవడంతో పాటు ఇద్దరి ఆలోచనల సారం ఒకటే కావడం తో అక్కడి నుంచి కలిసే సైకిల్ యాత్ర చేపడుతున్నారు. వీరిరువురూ.. సోమవారం రాత్రి దాటిన తరువాత పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో సీతారామాలయానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో యాత్రను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. నీరు సకల జీవరాసులకు అవసరమైందని, దీన్ని దుర్వినియోగం చేయవద్దన్నారు. మాదక ద్రవ్యాలు, మద్యపానం వల్ల యువత చెడిపోతున్నారని, సంఘంలో అనేక అసాంఘిక కార్యక్రమాలకు ఈ రెండే ప్రధాన కారణమని, దీన్ని నిర్మూలించాలనే తపనతో యాత్రను ప్రారంభించామన్నారు. అన్ని రాష్ట్రాల్లో తమకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని వివరించారు.

ప్రజల ముంగిటకు పాలన

నరసన్నపేట: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చామని మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం కంబకాయి గ్రామంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధనరావు, ఎంపీపీ ఆరంగి మురళీ,చింతు అన్నపూర్ణ పాల్గొన్నారు.

సచివాలయతోనే ప్రజల వద్దకు..

కరకవలస(ఎల్.ఎన్.పేట): గ్రామ సచివాలయాల నిర్మాణాలతో ప్రభుత్వం ప్రజల వద్ద పాలన క్షేత్రస్థాయిలో అందిస్తోందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. కరకవలసలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, ఎంపీ డీవో కాశీప్రసాదరావు, ఏవో పి.లతాశ్రీ పాల్గొన్నారు.

పోర్టు వాహనం ఢీకొని గొర్రె మృతి

టెక్కలి రూరల్: చిన్ననారాయణపురం గ్రామం వద్ద మంగళవారం మూలపేట పోర్టు వాహనం ఢీకొని మద్దిలి సురేష్‌కు చెందిన గొర్రె మృతి చెందింది. గ్రామ సమీపంలో మేత మేస్తున్న గొర్రెలు రోడ్డు దాటుతున్న క్రమంలో పోర్టు వాహనం ఢీకొని తన గొర్రె మృతి చెంది నట్లు బాధితుడు పేర్కొన్నాడు. పోర్టు వాహనాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

జలుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.దామోదరరావు తెలిపారు. ఎంపీ పీ వాన గోపి అధ్యక్షతన ఉదయం పదిన్నర గంటలకు జరుగు సమావేశంలో సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

12న జిల్లా స్థాయి 5కె రన్

పలాసరూరల్: ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 12న పలాస మండలం మర్రిపాడు జంక్షన్ వద్ద నుంచి 5కే రన్ నిర్వహిస్తున్నట్లు వేదిక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 6 గంటలకు మర్రిపాడు జంక్షన్ వద్దకు చేరుకోవాలన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



పాతపట్నం: సమస్యల పరిష్కారమే లక్ష్యమని విద్యుత్ విని యోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంత న్యాయ మూర్తి బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక సబ్ డివిజినల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం వేదికను నిర్వహించారు. మండల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తదుపరి చర్యలకు అధికారులకు ఆదేశించారు. అనంతరం ఏపీ మోడల్ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించార కార్యక్రమంలో టెక్కలి ఈఈ జి. శంకరరావు, డీఈఈ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అత్యాచారం

కవిటి: మండల పరిధి తీరప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల వయసు గల చిన్నారిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ చిన్నారి తల్లి మంగళవారం పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 31న జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి సమీపంలో ఆటలాడుకుందా మంటూ 12 ఏళ్ల వయసు కలిగిన ఐదుగురు బాలురు ఆ చిన్నారిని తీసుకెళ్లి అసభ్యంగా ప్రవరించి, లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయం ఆ చిన్నారి తన తల్లికి చెప్పడంతో గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారంతా ఆమెకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల నిర్ణయాన్ని కాదని ఆ చిన్నారి తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఆ ఐదుగురు బాలురుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

బంగారం తాకట్టు కేసులో ముగ్గురికి బెయిల్

శ్రీకాకుళం క్రైం: గార మండలంలో సంచలనం రేపిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టిన కేసులో మిగిలిన ముద్దాయిలకు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేసి జైలుకి పంపిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆరుగురుకి బెయిల్ రాగా కేసు విచారణలో భాగంగా మిగిలిన ముగ్గురుకి బెయిల్ ఇవ్వలేదు. ఇందులో ఉరిటి కిరణ్, పొన్నాడ తిరుమలరావు, ముంజి సురేష్‌లను పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో మంగళవారం వారి ముగ్గురికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రిలీజ్ అయ్యారు. అయితే తాకట్టు పెట్టిన బంగారాన్ని పోలీసులు రికవరీ చేసి కోర్టుకు అప్పగించారు. ఈ బంగారం ఖాతాదారులకు అందించాల్సి ఉండగా, బ్యాంకు నుంచి కొన్ని పత్రాలు కోర్టులో సమర్పించాల్సి ఉండడంతో ఖాతాదారులకు అందించడంలో ఆలస్యమవుతున్నట్టు తెలుస్తుంది.

వరి కుప్పలు, ధాన్యం బస్తాలు దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న ధాన్యం బస్తాలు

జి.సిగడాం: ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ఎదుటే కాలి బూడిదవడంతో రైతులు బోరున విలపించారు. సీతంపేట గ్రామానికి చెందిన శాసపు సత్యంకు చెందిన ఆరు ఎకరాలు గడ్డివాము, 20 ధాన్యం బస్తాలు, లెంక సన్యాసికి చెందిన 40 బస్తాల ధాన్యం, శాసపు పాపినాయుడుకి చెందిన మూడు ఎకరాల వరి చేను దగ్ధమయ్యాయి. కళ్లంలో ధాన్యం నూర్పుతున్న సమయంలో నూర్పు యంత్రం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ఈ ప్రమాదం సంభవించింది. నూర్పు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నా శకటం వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో పక్కనే ఉన్న నేల బావిలో నీటిని తోడి స్థానికులు మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2.50 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్టు వీఆర్వో బూర ఎరకయ్య తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: లఖందిడ్డి పంచాయతీ తలగానపేట గ్రామానికి చెందని ఉప్పాడ రోహిణి రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఉప్పాడ అప్పన్నపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ షేక్‌మహ్మద్‌అలీ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రోహిణిరావు తన పశువుల పాకలో మట్టిని చదును చేస్తుండగా తన అన్న కుమారుడైన అప్పన్న కర్రతో దాడి చేశాడని ఫిర్యాదు చేశారని, ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

17 కిలోల గంజాయి స్వాధీనం

జలుమూరు: లింగాలవలస కాలనీలో ఒక వృద్ధురాలి ఇంటిలో, హరిక్రిష్ణమ్మపేటలోని ఆ వృద్ధురాలి బంధువు ఇంటిలో మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి 17 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్‌ఈబీ అధికారులు వారి ఇళ్లల్లో సోదాలు చేశారు. గంజాయిని స్వాధీనం దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నెలరోజుల్లోగా పనులు పూర్తి చేయాలి

మెళియాపుట్టి: ఏకలవ్య పాఠశాలల్లోని పనులను నెలరోజుల్లోగా పూర్తి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభుడు అనంతనాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏకలవ్య పాఠశాల పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2017లో ఎస్టీ విద్యార్థుల కోసం కేంద్ర నిధులతో చేపట్టిన పనులు నేటికీ పూర్తి చేయకపోవడంపై ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. నెలరోజుల పాటు గడువు ఇస్తున్నామని, అప్పటికీ పూర్తి చేయకుంటే సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. జేసీ నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఈ శిమ్మన్న, తహసీల్దార్ పి.సరోజిని, డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ ఉన్నారు.

సామాజిక ఆసుపత్రి సందర్శన

పాతపట్నం: స్థానిక సామాజిక ఆసుపత్రిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, మందుల పంపిణీపై రోగులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడి తెలుసుకున్నారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పీడియాట్రిక్ పోస్టు ఖాళీగా ఉందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జేసీ నవీన్, ఐటీడీఏ పీవో కల్పనా కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు తదిత రులున్నారు.

● **టెక్కలి:** జాతీయ ఎస్టీ కమిషనర్ సభ్యుడు అనంతనాయక్ మంగళవారం లింగాలవలస పంచాయతీ సన్యాసిపేటలో పర్యటించారు. ఆ గ్రామంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య భూ ముల విక్రయాలకు సంబంధించిన అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు భూములు అమ్మకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జేసీ నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, గిరిజన సంఘ నాయకులు వాబ యోగి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలి


విస్తృత స్థాయి సమావేశంలో జనసేన పార్టీ నాయకులు

శ్రీకాకుళం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చెయ్యాలన్నారు. త్వరలో 38 మండలాలు, గ్రామ, బూత్ కమిటీల నియామకం పూర్తి చేస్తామన్నారు. వైసీపీ విముక్తి ఆంధ్రాను సాధించుకునేందుకు ప్రతీ ఒక్కరూ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల చైతన్య, పేడాడ రామ్మోహన్, కణితి కిరణ్, విశ్వక్షేణ్, దాసరి రాజు, దుర్గారావు, ప్రవీణ్, కోత పూర్ణ చంద్రరావు, కామేష్, వెంకీ, సిద్ధూ, రవి తదితరులు పాల్గొన్నారు.

సహస్ర దీపాలంకరణ


స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మంగళశాసన పాశురం సందర్భంగా నారాయణ తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి అలంకరణ, పూజలు నిర్వహించారు. అదేవిధంగా కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళ శాసన పాశురం పూజలు నిర్వహించారు. భక్తులు దీపాల అలంకరణ పూజలు నిర్వహించుకున్నారు.


కోటబొమ్మాళి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


నరసన్నపేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు చేపట్టిన నిరసన మంగళవారం కొనసాగింది. గత 29 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. కొన్నిచోట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి రూరల్: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

60 కుటుంబాలు టీడీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అశోక్, టీడీపీ నాయకులు

కంచిలి: బైరిపురం పంచాయతీ పరిధిలోని బైరిపురం, ఘాటీ గ్రామాలకు చెందిన 60 కుటుంబాలు డాక్టర్ గన్ని పవిత్ర ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీలో చేరాయి. గ్రామానికి చెందిన పోకల లోకనాథం, గన్ని చంద్రయ్య, బల్ల కుమారస్వామి, గన్ని ధర్మారావు, బల్ల పాపారావు, జక్కం వెంకటరావు, ఎంద్రపాటి దీనబంధు, గన్ని కుశరాజు, మందపాటి మీనాకుమారి తదితరులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బంగారు కురయ్య, మాదిన రామారావు, బొడ్డ హరిబాబు, వాసాల రమేష్, గన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రణస్థలం: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987-92 మధ్య 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం హైస్కూల్ ప్రాంగణంలో జరిగింది. తమ కుటుంబ సభ్యులతో హాజరై సందడిగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు పిన్నింటి సూర్యనారాయణ, ఆకుల సన్యాసినాయుడు, ఎం.లక్ష్మీనాయుడు, ఎస్.సత్యవతి, డీఎస్ ప్రసాదరావు, ఎం.లక్ష్మణరావు, ఎం.ధర్మారావు, బి.చందు, ఆర్.లక్ష్మణరావును ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకా లను గుర్తుకు తెచ్చుకున్నారు. పలువురు పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి గారపోలమ్మ, బూర్జపాడు అసిరిపోలమ్మ అమ్మవారి ఆలయాల్లో సంక్రాంతి ముందు వచ్చే మంగళవారం పితృదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


అలంకరణలో అసిరిపోలమ్మ

విరాళాలు సేకరించి.. చెరువు గర్భం చదును చేసి..

● తాళ్లభద్రలో క్రీడా మైదానం ఏర్పాటు


చెరువు గర్భాన్ని యంత్రంతో చదును చేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని తాళ్లభద్ర గ్రామ యువకులు రూ.50 వేలు పోగుచేసి క్రీడామైదానాన్ని చదును చేసుకున్నారు. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వ హిస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్కడా క్రీడాప్రాంగణాలు లేకపో వడంతో క్రీడా కారులు ఇబ్బందిపడుతున్నారు. అటు సరైన శిక్షణ లేక క్రీడాకారులు ఓటమి చవిచూస్తున్నారు. అదే పరిస్థితి తాళ్లభద్ర యువతకు ఎదురైంది. గ్రామంలో సరైన క్రీడామైదానం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని యువత గుర్తించారు. దీంతో గ్రామంలోని వండాయి చెరువు గర్భాన్ని చదునుచేసి క్రీడా మైదానం ఏర్పాటుచేయాలని భావించారు. దీంతో యువకులు రూ.50 వేలు పోగుచేసి క్రీడామైదానాన్ని చదును చేసుకున్నారు. కనీసం వర్షాకాలం వరకైనా మైదానం ఉంటుందన్న ఆశతో ఈ పనిచేశామని గ్రామ యువత సీర లోకనాథం, రౌతు పాపారావు, బెస్త జానకిరావులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి శాశ్వత క్రీడా మైదానాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ఎంఈవోల సంఘ నూతన కార్యవర్గం


ఎన్నికైన ఎంఈవోల సంఘ కార్యవర్గం

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవో) సంఘ కార్యవర్గం మంగళవారం నగరంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జరిగింది. జి.సిగడాం ఏంఈవో ఎ.రవి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడిగా జె.చిన్నవాడు (సంతబొమ్మాళి), ప్రధాన కార్యదర్శిగా పి.దాలినాయుడు (నరసన్నపేట), కోశాధికారిగా యు.శాంతారావు (నరసన్నపేట), రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.పున్నయ్య (ఎచ్చెర్ల), గౌరవాధ్యక్షుడిగా జి.రాజేంద్రప్రసాద్ (ఆమదాలవలస), ఉపాధ్యక్షులుగా కె.రాంబాబు (హిరమండలం), సీహెచ్ తిరుమలరావు (పాతపట్నం), శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శిగా ఎం.మురళీకృష్ణ(లావేరు), టెక్కలి డివిజన్ కార్యదర్శిగా జి.చిన్నారావు (టెక్కలి) ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో జిల్లాలోని 30 మండలాల నుంచి 58 మంది ఎంఈవోలు పాల్గొన్నారు.

రహదారి పక్కనే చెత్త

● స్థల సేకరణకే పరిమితమైన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

● నిధులున్నా.. పనులు చేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు


కొండ వద్ద రహదారి పక్కనే వేస్తున్న చెత్త

గార: గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పిస్తూ ఆరోగ్య వంతమైన సమాజం కోసం అంతా కలిసి రావాలి అని అధికారులు చెపుతున్నా.. క్షేత్రస్థాయిలో చాలా చోట్ల అది కనిపించడం లేదు. పూసర్లపాడులో నాలుగేళ్లగా చెత్త సంపద కేంద్రం నిర్మాణం చేపట్టకపోవడంతో, సుమారు వెయ్యి జనాభా కలిగిన ఈ గ్రామంలో రోజూ సేకరించిన చెత్తను దగ్గరలో ఉన్న కొండ వద్ద రహదారి పక్కనే వేస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ఇబ్బందిపడుతున్నారు. ఈ గ్రామంలో చెత్త సంపద కేంద్రం నిర్మాణం కోసం రూ.నాలుగు లక్షలు మంజూరైనా, స్థలం అందుబాటులో ఉన్నా పనులు మాత్రం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఒకవేళ ఈ కేంద్రం నిర్మాణ పనులు చేస్తే బిల్లులు సకాలంలో వస్తాయో లేదో అన్న భయంతోనే ఎవరూ ఆసక్తి చూపడం లేదనేది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో అధికారులు ఇక్కడ చెత్త సంపద కేంద్రం నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ గ్రామంలో చెత్త సంపద కేంద్రం నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. స్థలం కూడా అందుబాటులో ఉంది. అందువల్ల ఈ కేంద్రం నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటాం.

- పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ, గార

జాడలో అడుగడుగునా..

జి.సిగడాం: జాడ గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తుంది. ఇటు చూసినా చెత్తా చెదారం దర్శనమిస్తుంది. గ్రామం నుంచి సర్వేశ్వరపురం వెళ్లే రహదారిపొడవునా అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలో ఎటు సూచినా చెత్తకుప్పలే కనిపిస్తాయి. పాఠశాల ప్రహరీ పక్కన డంపియార్డును తలపించేలా చెత్త కుప్పలుతో పాటు అధ్వానంగా తయారైంది. ఈ చెత్తకుప్పలను దాటుకునే విద్యార్థులు పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు పంచాయతీ అధికారులకు, శానిటేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోంది.


పాఠశాల పహరీ పక్కనే డంపింగ్ యార్డులా..

గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా అధికారులకు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

హామీల అమలులో జగన్ విఫలం

● 15వ రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె

ఇచ్ఛాపురం: కార్మికులపై ప్రభుత్వ నిరంకుశ ధోరణి మారాలని సీఐటీయూ నాయకులు కోరారు. హామీల అమలు జగన్ విఫలమయ్యారని ఆరోపించారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు మంగళవారం పారిశుధ్య కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. పారిశుధ్య కార్మికులు వినూత్నంగా నుదిటికి విభూతి పెట్టుకొని నిరసన తెలిపారు.

● **ఆమదాలవలస:** తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పారిశుధ్య కార్మిక నాయకుడు తాడి సంతోష్ కోరారు. నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న శిబిరం వద్ద సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. మునిసిపల్ పారిశుధ్య, కార్మిక నాయకులు కె.శ్రీనివాసరావు, తారకేశ్వరరావు, జె.శ్రీను పాల్గొన్నారు.


ఆమదాలవలస: నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు


ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్

కలెక్టరేట్: గిరిజన సంక్షేమానికి అంకితభావంతో పనిచేసి, వారి జీవితాలలో వెలుగులు నింపాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో గిరిజన సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత నాయక్ మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజనులే అడవికి హక్కుదారులనే విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, చట్టాలు, పాలసీల ద్వారా కల్పించిన హక్కులను గిరిజనులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. వారి సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది తెలుసుకుని త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో భూమిలేని ఎస్టీ వ్యవసాయ కూలీల వివరాలను తమకు అందించాలని అన్నారు. గిరిజన విద్య, ఆరోగ్యం, ఉపాధి, బ్యాంకింగ్, విద్యుత్తు సేవలు, ఎస్టీ అట్రాసిటీ కేసులు తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా గిరిజనాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు. సమావేశంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ జయంత్ జె.సరోడే, ప్రతినిధి బృందం రాధాకాంత త్రిపాఠి, గోవర్ధన్ ముండే, పీకే పరీదా, దీనబంధు నాయక్, సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనా కుమారి, ఏఎస్పీ తిప్పేస్వామి, శ్రీకాకుళం, పలాస ఆర్డీవోలు రంగయ్య, భరత్ నాయక్, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాట్లుపై దృష్టి సారించినట్టు ఓటర్ల నమోదు అధికారి బి.పద్మావతి అన్నారు. మంగళవారం లావేరు, రణస్థలం సెక్టార్ అధికారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాల వివరాలన్నీ రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస చేరుకున్న స్పీకర్

ఆమదాలవలస: విశాఖలోని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన స్పీకర్ సీతారాం ఆమదాలవలస చేరుకున్నారు. బీపీ, సుగర్ లెవెల్ పెరగడంతో జనరల్ చెకప్ నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి మూడురోజుల కిందట స్పీకర్ వెళ్లారని వైసీపీ యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్ తెలిపారు. డిశ్చార్జ్ కావడంతో మంగళవారం ఆమదాలవలసలోని నివాసంలోనే స్పీకర్ ఉన్నారని చెప్పారు.

హెచ్‌సీ కుటుంబానికి ఫండ్ అందజేత

శ్రీకాకుళం క్రైం: అనారోగ్యంతో సోమవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఆర్ హెచ్‌సీ డి.కేశవరావు కుటుంబానికి డెత్‌రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్‌ను మంగళవారం పోలీసు అసోసియేషన్ తరుపున అందజేశారు. పరామర్శించిన వారిలో జిల్లా అసోసియేషన్ సభ్యులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

జడ్పీలో సోలార్ రూఫ్‌టాప్



అరసవల్లి: జిల్లా పరిషత్ సమావేశ మందిరంపై రూ.40,24,800లతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరిశీలించారు. ఇందులో కలెక్టర్ రూ.20,12,400 నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20,12,400 వెచ్చించి ఈ సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు.

పల్లె చైతన్యంతోనే దేశ వికాసం

సరుబుజ్జిలి: త్యాగం, సేవ ప్రధాన ఆశయాలుగా గ్రామాలు, పల్లెలు చైతన్యవంతం అయినప్పుడే భారతదేశ వికాసం సాధ్యపడుతుందని సేవాభారతి జిల్లా సేవా ప్రముఖ్ కనుగుల సత్యం తెలిపారు.మంగళవారం రొట్టవలస వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీశారదా రామకృష్ణ సేవాసమితి సారథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజన వారోత్సవాల నాలుగోరోజు గ్రామ సేవయే రామసేవ పేరిట ప్రత్యేక కార్య క్రమం జరిగింది. కార్యక్రమంలో ధార్మిక జట్టు సభ్యులు పి.మన్మథరావు, డి.రవికుమార్, సీహెచ్‌వరహాకృష్ణ, కె.నాగరాజు, ఎం.రమణమూర్తి, బి.అప్పలరాజు, రామసేవకులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు


ఏసీపీకి స్వామివారి చిత్రపటాన్నిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళవారం జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జి.అనంతనాయక్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ అందజేశారు. ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ వెంకటరావు, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

● అలాగే మంగళవారం స్వామివారిని బీఎస్ఎన్ఎల్ సీజీఎం, చెన్నై, పి.మురళీమోహనరావు, విశాఖ జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ కుటుంబసమేతంగా వేర్వేరు గా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ వారికి జ్ఞాపికలను అందజేశారు.